జోరుమని వర్షం కురుస్తోంది. శ్రావణ మంగళ వారం. రాత్రి రెండో ఝాములో పట్టుకున్న వర్షం తెల్లారి ఆరుగంటలు దాటినా వదల్లేదు. తవిటమ్మ తన చిన్న తాటాకుల గుడిసె ముంజూరుకి ఆను కుని దిగాలుగా రోడ్డువైపు చూస్తోంది. అక్క డన్నీ గుడిసెలే. రోడ్డుకావల చిన్నవి పెద్దవీ పెంకుటిళ్ళు వున్నాయి. గుడిసెలుండే చోటుకి కొంచెం దూరంగా పెద్ద రావిచెట్టు, వేప చెట్టూ, వున్నాయి. ఆ పెద్దపెద్ద చెట్లు మానుల చుట్టూ నాలుగయిదు అడుగుల వెడల్పున సిమెంటు చప్టా చేసి వుంది. ఆ చెట్టు నీడన రిక్షావాలాలు జట్కా బళ్ళవాళ్ళూ కూర్చుంటూ వుంటారు. బస్టాండు వూరికి ఇంకా దూరంగా ఇంకో పేటలో వున్నా, ఇక్కడే చాలామంది దిగిపోతూ వుంటారు. అంచేత రిక్షా వాళ్ళకీ, జట్కావాళ్ళకీ చాలా చవ్వున బేరాలు వస్తూ వుంటాయి. అప్పల్నాయుడు లోపల్నుంచి వచ్చేడు.

"ఇకి వాన వదల్దు ఇయ్యేల! పన్లోకి పోలేక పోయావు?" అన్నాడు. నాయుడు దృఢంగా వుంటాడు. ఈ మధ్యనే రిక్షా స్వంతంగా కొను క్కున్నాడు. నిరుడీరోజుల్లో తవిటమ్మకు ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు కవలలు. తవిటమ్మ తల్లి పేరు రావుడు. సోమమ్మ, నాయుడు తల్లి.

"ఈవరాళ్ళు నా పేరంటే నా పేరే అని కుమ్ములాడుకోకుండా ఇద్దరూ ఒకపాలే పుట్టేరు" అని నవ్వుకుంది తవిటమ్మ. "రామీ", "సోమీ" బంగురుతూ వళ్ళు అంతా మట్టిచేసుకుంటారు. చేతినిండుగా వుంటారు. "పన్లోకి పోటం కాదు. మన గుడిసె అంతా వానే! ఇంకా ఈ వానలు నాలుగు నెల్లుంటాయి. గుడిసె కప్పియ్యాలి. ఎక్కడా పొడిజాగానేదు." అంది తవిటమ్మ.

"ఇయ్యేటికి నీ పురుటికి అయిన అప్పంతా తీరచాలి. వచ్చేయేటికి కప్పిద్దాం పాక."

"ఇయ్యేడే వంద పద్నాలుగు రూపాయలంట తాటాకులు. మన ఇల్లు తాటాకులన్నీ మొరుం మొరుం అయిపోయేయి. అన్ని కొత్త తాటాకులు కొని కప్పిస్తే మళ్ళీ నాలుగయిదేళ్ళ వరకూ, ఇంటికి ఏం ఖర్చుపెట్టక్కర్లేదు."

"యాభయి రూపాయిలెక్కడ్నించి వొస్తయి? నువ్వు ఆర్నెల్లు ఇంటికాడే కూర్చుండిపోయినా వాయె!" అన్నాడు.

తవిటమ్మ పురుడు వచ్చినాక అయిదారు నెల్లు పనిలోకి వెళ్ళలేదు. ఇప్పుడు నాలుగయిదు ఇళ్ళల్లో పాచిపనులు చేస్తోంది. కాఫీలు టిఫిన్లు ఒక పూట భోజనానికి సరిపడా అన్నం దొరుకుతుంది. నెలకి నలభయి రూపాయలు జీతం వస్తుంది. ఈవరా ళ్ళిద్దరూ ఇంట్లో కూర్చుని పిల్లల్ని చూస్తారు. భార్యాభర్తా వచ్చేసరికి వంట చేసి వుంచుతారు. తవిటమ్మ పని చేసే ఇళ్ళల్లో ఏమన్నా బియ్యాలూ పప్పులూ బాగుచేయాలంటే ముసలమ్మలిద్దరూ వెళ్ళి కానీ పరకా సంపాదిస్తూ వుంటారు. ఎవ రింట్లోనో బిగ్గరగా రేడియో పెట్టారు. తెలుగులో వార్తలు వస్తున్నాయి.

"ఇయ్యాల పన్లోకి వెళ్ళవా! వానకి జడిచి ఇంట్లో కూర్చుంటే ఏం వొస్తుంది. పన్లోకి వెళ్తే కాపీ నీళ్ళయినా దొరుకుతాయి. టిపిని తినొచ్చు. ఎళ్ళకూడదా!"

"ఇంత గాజుకాగితం అయినా లేదు. తప్మీద చినుకడితే ప్రాణం జిల్లుమంటోంది. ఆరిళ్ళల్లో బాయికాడ కూర్చుని గిన్నెలు తోమాల, ఆరుబయట వానంతా నా పరమే!"

"కాగితం రిక్షా డబ్బాలో వుంది తీసుకొనెళ్ళు. బేగెళ్ళు!" అన్నాడు.



అంత తొందర ఎందుకు చేస్తున్నాడంటే తవిటమ్మ పనిచేసే చోట ఇచ్చే కాఫీ అంతా చిన్న సత్తుకారియర్‌లో పోసుకొచ్చి ఇంటిదగ్గర మళ్ళీ వెచ్చబెట్టుతుంది. ముసలాళ్ళిద్దరూ నాయుడూ కొంచెంకొంచెం తాగుతారు.

"ఎల్తాలే అబ్బ! రిక్షా కాడికి పోయి ఆ గాజు కాగితం వ్రటా. పైన యేసుకుని యెల్తాను"

"అబ్బ! నేను పొడిగా వున్నాను. నువ్వెల్లాగూ బయటికి పోవాలి. తీసుకునెల్లిపో! అయినా సిన్మా ఈరోయిన్ ఎట్టా తడుస్తుందో చూడు సిన్మాలో!'' అన్నాడు.

"సంబరం! సిన్మా ఈరోయిన్లు లక్షలకు లక్షలు గడిస్తారు. రోడ్డెంట తడిసితడిసి పరుగెట్టినా ఇళ్ళల్లో ఖరీదయిన దుప్పట్లు కప్పుకోని తొంగుంటారు. ఆళ్ళకు మల్లె మనం తడిస్తే, ఇళ్ళల్లో గోనెగుడ్డలే కదా కప్పుకుంటానికి?'' అంది తవిటమ్మ.

"నిజమేలే!'' అని అంగీకరించాడు అప్పల్నాయుడు.

# పెక్కోరోజు

వి.వి.యస్. అచ్యుతవల్లి




తవిటమ్మ చూసిచూసి ఇంక వాన వెలిసేది లేదని పరుగుపరుగున చెట్టువద్దకు వెళ్ళి రిక్షాడబ్బాలోంచి ప్లాస్టిక్ కవర్ తీసుకుని నెత్తిమీదకు వేసుకుని పనిలోకి వెళ్ళిపోయింది. జయమ్మ వంటింటి గడపలో కూర్చుని తవిటమ్మ కోసం ఎదురుచూస్తోంది.

జయమ్మ, వెంకట్రావు ఏవో చిన్న ఉద్యోగాలు చేసుకుంటున్నారు. ఇద్దరు పిల్లలు. అది చిన్న బంగాళా. పెంకుటింటిలో ఒక వసారా పోర్షన్. ముందు చిన్న అరుగు. రెండు గదులు వున్నాయి. పెరటి వెంపు వున్న గదిలో తడిక అడ్డం పెట్టుకుని స్నానాలు చేస్తారు. మిగిలిన సగం గదిలో వంట సామాన్లు పెట్టుకుంటారు. వున్న ఒక్కగదిలోనూ రెండు కుర్చీలు, టేబులు, ఒక మంచం, వరుపు వున్నాయి. మంచం క్రింద రెండు పెద్ద ట్రంకుపెట్టెలున్నాయి. దాంట్లో వాళ్ళకున్న గిన్నెలు చెంబులు బట్టలు, పుస్తకాలు అన్నీ పెట్టేసుకుంటారు. మంచం గోడ వారగా వేసి వుండటం గుమ్మానికి అడ్డం రాకుండా నడవటానికి చోటు వుంటుంది. కిటికీలకు షేడ్సు లేకపోవటం వించి కిటికీలోంచి వర్షంనీరు లోపలకు కారుతూ ఇల్లంతా తడీతడిగా మెతక కంపు కొట్తోంది. తవిటమ్మను చూసి జయమ్మ ముఖం విప్పారింది.

"అమ్మయ్యా వచ్చేవా తల్లి! ఈ పూట నాగా పెట్టేశావనుకున్నాను.'' అంది, కాఫీ దానికుంచింది గ్లాసులో. ఆ గ్లాసుని కుంపటిలో పెట్టి వుంచింది. తవిటమ్మ లోపలి గడపలోకి వచ్చింది. కుంపటి చుట్టూ వున్నాయి – అల్యూమినియం గిన్నెలు.

"వాన వదల్డం లేదు. అమ్మ! జొరం వొచ్చేలాగున్నది. బాత్రూంలో కడిగేయినా? అంట్లగిన్నెలు!'' అంది.

"బాత్రూంలో కడిగేస్తే తూములో మన్నూ మశానమూ చేరిపోతుంది. కుళ్ళు కంపు కొడుతుంది, మళ్ళీ ఇటుప్రక్క మేము వంటా భోజనాలూ చేయాలి. ఎల్లాగో అల్లా బావిదగ్గర కడిగేద్దూ! ఎల్లానూ తడిసావుకదా!'' అంది జయమ్మ. అందరికన్నా జయమ్మే ఎక్కువ డబ్బు ఇస్తుంది. రెండు పూటలా అంట్లు కడిగి, పీదివాకిలూడ్చి, చీరలూ పిల్లల బట్టలూ ఉతికి ఆరవేసినందుకు పదిహేను రూపాయిలిస్తుంది. పనిలోకి వచ్చేసరికి వేడి వేడి కాఫీ ఇస్తుంది. అంచేత జయమ్మ అంటే అభిమానమే – తవిటమ్మకు! కాఫీ త్రాగి



గిన్నెలన్నీ ఖాళీ బకెటులోకి తీసుకుని బావిదగ్గరకు వెళ్ళింది తవిటమ్మ. వాన జోరు తగ్గలేదు. పిల్లలు పడుకున్న గది చీకటిగా వుంది. వీధిగుమ్మం తీసే వుంచినా, వెలుతురు మసక మసకగా వుంది. ఎలక్ట్రిక్ దీపం వేద్దామంటే పట్టపగలు కూడా దీపాలు వేసుకూర్చుంటే ఎల్లాగు? అని ఇంటి వాళ్లు గొడవ చేస్తారు. సగం తడిసిపోయిన పక్కమీద పిల్లల్ని గుండెల్లోకి పొదుకుని వంపుగా పడుకున్నాడు వెంకట్రావు. గదిలోకి వచ్చింది జయమ్మ. లైటు వేసింది. గది అంతా వెల్తురు పరుచుకుంది. క్రింద అంతా చారిక చారికలుగా వాననీరు. అలమరలోంచి దువ్వెన తీసుకుని జుట్టుముడి విప్పింది. "అప్పుడే ఎనిమిదయిపోతోంది. ఇవ్వాళ్టికి కూర ఏమీ చెయ్యను. అన్నం వండేస్తాను. ఇప్పుడు వచ్చింది పనిచేసే. మనిషి!'' అంది. వెంకట్రావు లేచాడు మంచం నడుంగా కూర్చున్నాడు.

"వంకాయిలున్నాయి కదా! వేయించేయ కూడదూ! ఎండిపోతున్నాయి!'' అన్నాడు.

"సాయంకాలం వేయించేస్తాను లెండి. మూడు మైళ్ళు పోవాలి నడుచుకుంటూ. బస్సులు టయిముకు వచ్చి చావవు. రిక్షాలు ఎక్కి తిరిగే స్తోమతు లేదు మనకి'' అంది.

"వానగా వుందికదా! రిక్షామీదే వెళ్ళు. పిల్లల్ని స్కూల్లో దింపి ఆ దారిన నీ ఆఫీసుకి నువ్వెళ్ళిపో వచ్చును.''

"రెండు రూపాయిలు అడుగుతున్నారు మరీనూ! రోజుకి రాను పోను నాలుగు రూపాయిలు అయితే నెలకు నూటఇరవయి రూపాయిలు రిక్షాలకే అయిపోతాయి. మా ఆఫీసు వద్ద ఒక చిన్న ఇల్లు వుంది.''

"అవును. నేనూ చూసేను. డాబాఇల్లు. ప్రక్క కిటికీలకు షేడ్సు వున్నాయి. మాకొల్లీగ్ పురుషోత్తం చూసేడు ఎనభయి రూపాలట అద్దె. ముందు వరండా గ్రిల్ వుంది. నడుంగా గది. వెనకటి గది వంటిల్లు. నాలుగు వాటాల వాళ్ళకి కామన్ లెట్రిన్ట! మనకిక్కడ దూరమయినా అద్దె తక్కువ కదా!'' అన్నాడు.

"అద్దె తక్కువే. ముప్పయి రూపాయిలు లోటుబడ్జెటు అవుతుంది. యాభయి రూపాయిలు వుంటే మరింకెన్నో అవసరమయిన వస్తువులు అమర్చుకో వచ్చును. లేకపోతే పళ్ళూ ఫలాలూ కొనుక్కొని మనం పిల్లలూ కడుపునిండా తినవచ్చును. "పోషకాహారం తీసుకోండి. పాలూ పళ్ళూ తీసుకోండి'' అంటూ రేడియోలో మహిళా మండలివాళ్ళు చెవిలో ఇల్లు కట్టుకుని చెబుతున్నారు కూడా!''

"అందుకని ఇల్లా పెచ్చులూడిపోయిన కొంపలో తడుస్తూ తడుస్తూ బ్రతుకు గడపాలా!''

"చక్కనమ్మ తడిసినా అందమే!''

"సొగసక్కర్లేదు కాని ముందు ఇల్లు సంగతి చూడండి వేరే ఇంకెక్కడయినా చిన్నపోర్షన్ వాన కురవనిది చూడండి.''

"ఈ సంవత్సరం ఆగు. వానాకాలం ఎన్నాళ్ళు వుంటుంది! గట్టిగా వానలు వరసగా పదిరోజులు అన్నా కురవవు. వస్తూ వుంటుంది. వెలుస్తూ వుంటుంది. వానాకాలానికి ఒక ఇల్లు ఎల్లా మారటం! మనం జాగ్రత్తగా వుంటే మనమే సొంతంగా ఒక ఇల్లు కట్టుకోగలం!''

"ఆహా! ఏనెలా మనిద్దరి సంపాదనలో కానీ అన్నా మిగల్చలేక పోతున్నాం. ఇంక సొంతిల్లు కట్టుకోగలమా! కలలో మాట!''

"ఇలలో నిజం ఎందుకు చేసుకోకూడదు! నువ్వెప్పుడూ చీరలూ సినిమాలూ అంటూ ఖర్చు చేస్తావు. రెండేళ్ళు నీ జీతం అంతా ఖర్చుచేయకుండా దాచు. మూడు వేలు అవుతుంది సంవత్సరానికి. ఆరు వేలు చేసి పదేళ్ళు రికరింగ్ డిపాజిట్ చేసామంటే మనకి ఒక సొంత ఇల్లు ప్రణాళిక లక్ష్యం నెరవేరినట్లే అవుతుంది.''

"నా జీతం లేకుండా మీ మూడువందలతో ఇల్లెల్లా గడపటం? పిల్లలిద్దరికీ కాన్వెంటు ఫీజు బూట్లు డ్రెస్సులు ఇవి అన్ని ఎల్లా అమురుతాయి?''

"వాళ్ళని మామూలు స్కూళ్ళల్లో చేర్పించుతే సరి! కాన్వెంటు కాన్వెంటు అంటమేకాని అక్కడ మాత్రం పెద్ద ఏమి శ్రద్ధగా చెబుతున్నారు? బూట్లు హేట్లు అంటూ బోలెడు పెట్టుబడి! దానివల్ల మనకి నెలకు నలభయి, యాభయి రూపాయిలు ఆదా అవుతుంది.''

"బాగుంది. ఉరిమి ఉరిమి మంగలం మీద పడినట్లు, మీకు పిల్లవెధవల చదువుల మీద పడింది దృష్టి. వాళ్ళన్నా కొంచెం బాగా చదువు కొంటె మనలా కానీ పరకా ఉద్యోగాలలో ఇరుక్కుపోకుండా మంచి ఉద్యోగాలకు అవకాశాలు వుంటాయి. మనం కష్టపడ్డా వాళ్ళని పైకి తేవాలి!''

"ఏమిటి పైకి తేవటం? వాళ్ళు డాడీ, మమ్మీ, ఆంటీ అంటూ ఇంగ్లీషు మాటలు మాట్లాడితే పెద్ద ఉద్యోగాలకు సోపానాలు వేసినట్లేనా! వాళ్ళు చదివేకొలదీ వాళ్ళ చదువుల్లో వాళ్ళకు నచ్చిన సబ్జక్టు మీద వాళ్ళు శ్రద్ధ తీసుకుని బాగా అవగాహనగా చదవాలి. అంతే కాని స్కూళ్ళల్లో ఏముంది! మామూలు స్కూళ్ళల్లో చదివేవాళ్ళు గొప్పవాళ్ళు అవటం లేదా? ఏదన్నా పెరిగేకొలదీ పిల్లల్లో వాళ్ళంతట వాళ్ళకే విద్యాభిలాష కలగాలి! మంచి ఉద్యోగం సంపాదించాలనే ఆశయం వాళ్ళకే పుట్టుకురావాలి.''

"సరేలెండి! మీ ఉపన్యాసం తర్వాత కొనసాగించవచ్చును. కాని బావివద్దకు వెళ్ళి రెండు బిందెలు నీళ్లతోడి తెండి!''

"తడిసిపోతానే బాబూ చలి!''

"చలిచలిగా వుందిరా అంటూ పాడుకో వచ్చును. పదండి!'' అంది.

" అమ్మగారూ !" అంటూ వంటింట్లోంచి కేక వేసింది తవిటమ్మ.

"ఏమిటే !" అంటూ జయమ్మ జడ వేసుకో వటం ముగించి జడ చివర్న ముడి వేస్తూ వచ్చింది. తవిటమ్మకి చీర బాగా తడిసిపోయింది. జాకెట్టు కూడా వంటికి అతుక్కుపోయింది. చీర కుచ్చెళ్ళు పిండుకుంటూ –

" అమ్మగారూ ! ముప్పయ్ రూపాయి లిప్పియ్య మన్నాడండీ మా నాయుడు. గుడిశ ఆకులన్నీ మొరాలయిపోనాయి. ఇల్లు కప్పిచ్చుకోవాల. చంటి పిల్లలు. ముసలమ్మలు వానకు ఇవకొత్తి పోతన్నారు" అంది. జయమ్మ నెల జీతం రెండు మూడు తారీకుల్లో ఇచ్చేస్తూ వుంటుంది. ఇంటద్దె పాలబాకీ, పని అమ్మాయి జీతం అన్నీ ఇచ్చేసి బియ్యం నలభయి కే.జి.లు కొని తెచ్చేస్తుంది.

" ఒక్కసారి ముప్పయి రూపాయిలు ఎల్లా ఈయగలనే ! అయినా ఇల్లన్నాక కురవకుండా వుంటుందా ! మా ఇల్లు చూడు ఎల్లా వుందో ! ఇల్లూవాకిలి ఒకటే సముద్రమయిపోతూంది. ఇంత వానలకు భవనాలయినా ఇల్లాగే వుంటాయి."

" మీ ఇంటికేమమ్మా ! ఇల్లంతా గచ్చు ! ఎంత వానవచ్చినా గాలేస్తే ఆరిపోద్ది. మా ఇల్లు బురద బురద. ఎంతకీ ఆరదు."

" బాగానే వుంది. అయినా అయ్యగారిని అడిగి చెబుతానులే " అంది జయమ్మ.

" అమ్మా !" అంటూ పిల్లలు లేచారు. జయమ్మ కుంపట్లో మరి కాసిని బొగ్గులేసి తవ్వెడు బియ్యం కడిగి పడేసింది. వెంకట్రావు బావి దగ్గర చేదతో నీళ్ళు తోడుతూ, "హరోంహరా!" అంటూ తనో రెండు చేదలు నీళ్ళు వంటి మీద పోసుకుని రెండు చేతులా రెండు బకెట్లతో నీళ్ళు తెచ్చి వంటింటి గడప మీద పెట్టాడు.

" ఇవిగో నీళ్ళు " అంటూ లోపలికి వచ్చేడు.

" అరెరే ఆ తడికదాటి రాకండి. వంటిల్లంతా తడిసిపోతుంది. టవలు నేతెస్తానాగండి !" అంటూ గబగబా ముందరిగదిలోకి వెళ్ళి టవలు తెచ్చి ఇచ్చింది.

" మరి నీళ్ళు రాణీగారు తేనక్కర్లేకుండా నేను తోడి తెచ్చాను. కనుక నాకు చక్కటి భోజనం అమర్చిపెట్టాలి."

" ఆదివారం నాడు మీకు విందు భోజనం చేస్తానులెండి. ఇవ్వాళ్టికి ఆవకాయ, మాగాయి, చింతతొక్కు, ఉసిరిపచ్చడి, ధనియాలపొడి, కరివే పాకుపొడీ వేసుకుని తినేయండి. ఆరు ఐటమ్స్‌తో ఆరు ముద్దలూ ! విందు భోజనం !"

" పెరుగన్నా వుందా !" అన్నారు దీనంగా.

" ఇవ్వాళ పాలవాడు రాలేదు పాలపొడితో కాఫీలు కలిపాను..'

" రాత్రి పెరుగు చిలక్కొట్టి రెండు పూటలా గడపాలి " అంది.

" హతవిధీ ! ఏమి భోజనం రా నాయినా ! చల్లాచమురూ లేని భోజనం ! ఏం చేస్తాం !" అన్నాడు.

పదిగంటలు అవుతూంటె భార్యాభర్తా భోజనాలు చేసారు. పిల్లలకి భోజనం పెట్టి కొంచెం మజ్జిగా అన్నం కలిపి టిఫిన్ డబ్బాలో పెట్టి రిక్షా పిలిచి ఆఫీసుకి బయలుదేరారు. తవిటమ్మ సందుమలుపు లోంచి వాళ్ళను చూసింది.

" ఇద్దరూ సంపాదిస్తున్నారు. ముప్పయ్ రూపాయలిమ్మంటె నసుగుతోందీ యమ్మ " అను కుంది తవిటమ్మ.

" ఎక్కడికన్నా అళ్ళ డబ్బు పట్టుకుని వెళ్ళి పోతామా ! అంత మనుషుల్ని నమ్మలేరా !" అని మళ్ళీ అనుకుంది. ఇంటికి వచ్చేసరికి ముసలాళ్ళు ఇద్దరూ మునగదీసుకుని గుడిశలో ఒక వారగా కూచున్నారు.

" వంట చేయనేదేటి !" అంది తవిటమ్మ. " పొయ్యి అంతా నీరూరిపోతున్నది. వాన వెలిస్తే ఆరుబయటన్నా ఇటికలు పెట్టి వొండాల గాలికి పొయ్యి ఎలగటంనేదు."

" అయ్యో మరి కాపి నీళ్ళెట్టా ఏడి చేయటం!"

"గుర్రాజు టీ బంకు కాడకెళ్ళు. వెచ్చచేసిస్తాడు" అంది తల్లి.

" అబ్బా ! మళ్ళీ తడిసి వెళ్ళాలి. వొళ్ళంతా వొణుకు పుడ్తోంది," అంది తవిటమ్మ.

" మీ ఆయన బండేసుకుని వెళ్ళినట్టున్నాడు " అంది రావమ్మ. మళ్ళీ తవిటమ్మ గుర్రాజు " టీ " బంకు వద్దకు వెళ్ళింది. కాఫీ కారియర్ కుంపటి మీద పెట్టి ఇచ్చాడు. తీసుకు వచ్చింది. ముస లమ్మలకిద్దరికీ వేడివేడి కాఫీ త్రాగేసరికి కళ్ళల్లోకి వెలుగు వచ్చింది. పిల్లలిద్దరు నులక కుక్కి మంచం మీద గోనె గుడ్డపరిచి వున్న పక్కమీద పడుక్కున్నారు. వాళ్ళ ప్రక్కన చేరబడింది తవిటమ్మ. ఒంటి నిట్రాడి పాక అది. పాక మధ్యనున్న ఆకులు ఎగిరిపోయేయి. తాటాకులన్నీ



ఎస్. శివకుమారి

బహుముఖ ప్రతిభాశాలిగా గుర్తింపబడిన శివ కుమారి ఇంగ్లీషు నాటకాలు 'ది రిచ్‌మాన్ అండ్ ది ఓల్డ్ ఉమెన్', 'మాక్‌బెత్', 'హామ్లెట్' మొదలైన వాటిలో నటించారు. కొన్ని తెలుగు చిత్రాలు, ఒక ఒరియా చిత్రంలోనూ నటించారు.

అల్లికలు, కుట్లు పనులు, ఎంబ్రాయిడరీ టైలరింగ్, చీరల మీద పెయింటింగ్ చేయడం మొదలైన వాటిలో ఆమె సిద్ధహస్తురాలని ఆమె ఇల్లే చెబుతుంది.

ఆమె భర్త శ్రీ నాగేశ్వరరావు విజయవాడ రైల్వేలో క్యాషియర్‌గా ఉంటున్నారు.

శివకుమారి ప్రస్తుతం ప్రయివేటుగా బి. ఎ. చదువుతున్నారు. తర్వాత పోస్టు గ్రాడ్యుయేట్ చేసి ఉద్యోగం చేయాలని ఆమె కోరిక. శివ కుమారి రన్నింగ్ రేస్‌లో కూడా ఎన్నో బహుమతులు గెల్చుకున్నారు. సంగీతం నేర్చుకున్నారు.

'ఈనాడు సినిమాలలో నిజమైన ' టాలెంట్ ' ఉన్నవారికి అవకాశాలు లభించడం లేదు. రికమెండేషన్ ఉన్న వారికే అన్ని అవకాశాలు. ఈ పరిస్థితి మారాలి' అని ఆమె అన్నారు. విజయవాడలో 300 మందికి పైగా ఔత్సాహిక కళాకారులుంటే మన నిర్మాతలు చిన్న పాత్రలకు కూడా మద్రాసు నుండి నటులను తీసుకు వస్తున్నారనీ, స్థానిక కళాకారులకు కూడా ఎక్కువ ప్రోత్సాహం యివ్వాలని ఆమె సూచించారు.

—రత్నమాల పై

నల్లగా పొగజూరిపోయి వున్నాయి. ముట్టుకుంటె పొడుం పొడుంగా రాలిపోతున్నాయి.

"రిచ్చాబండి రిచ్చాబండి అంటూ కూడెట్టిన సొమ్మంతా రిచ్చాబండికి పోసేసి నాడు. ఇల్లు మరీ వోనవ స్తే నిలబడటానికి జాగా లేకుండా పోనాది. ముసలాళ్ళు చంటిపిల్లలు. ఎట్లాగో ఈ వానాకాలం వెళ్ళేదీ'' అనుకుంది తవిటమ్మ. గుండెల దగ్గర పిల్లల వెచ్చదనంతో కడుపులో ఆకలిగా వున్నా సొమ్మసిల్లి పోయినట్లు నిద్ర పట్టేసింది తవిటమ్మకు. కొంచెం కనుచీకటి పడే సమయానికి ఇంటికి వచ్చేడు నాయుడు. ముసలమ్మలిద్దరూ చెరొక నులక మంచం మీదా కూర్చుని చుట్టకాల్చు కుంటున్నారు.

"ఇదేటది? మధ్యాహ్నం పనులెగ్గొట్టేసినాదేటి'' అన్నాడు తవిటమ్మ నిద్రపోవటం చూసి.

"పరసం. ఇంకెళ్ళలేక అల్లానే పడుకున్నది,'' అంది సోమమ్మ.

"వొంట చేయలేదివ్వాళ పొయ్యి ఎలగనేదు.''

"ఇల్లు కప్పిచ్చాల. అప్పులు తీర్చి రిచ్చాబండి సొంతం చేసుకోవాలన్న యావతో ఇల్లు అశరద్ద అయిపోనాది. ఏదో దారి చూసి ఇల్లు కప్పిచ్చు కోవాల'' అన్నాడు. కారియర్ పట్టుకెళ్ళి దాన్నిండా కాఫీ పోయించి తీసుకొచ్చేడు. చేతిలో వేడివేడి మినపరొట్టె ముక్కలున్న పొట్లాం. ఆ గుడిశలకు చివరగా ఒక చిన్న వ్యాపారి ఇల్లుంది. రోజూ రెండుమూడు అడ్డల మినపపప్పు రుబ్బి మినపరొట్టెలు వేస్తూ వుంటారు. చాలామంది కొనుక్కుంటూ వుంటారు.

"లెగు లెగు!'' అన్నాడు. తవిటమ్మ ఉలిక్కి పడి లేచింది.

"అప్పుడే వొచ్చేసేవేటి!'' అంది చెంగుతో ముఖం తుడుచుకుంటూ.

"అర్రూపాయలొచ్చేయి. రాత్రి అయ్యేకొద్దీ చలీవోనా జోరెక్కువయ్యేలాగుంది. అంచేత వొచ్చేసేను,'' అన్నాడు.

"నిదరట్టేసింది. మద్దేన్నం పనుల్లోకి ఎళ్ళలేక పోయేను.''

"ఏం జేత్తావులే! మరీ వాన వదలకుండా కురుస్తోందాయె!''

"వెళ్ళుంటే ముసలాళ్ళకన్నా బోయినం దొరుకును. పొయ్యి రాజెయ్యనేదు.''

"ఏంజేత్తాములే!'' అన్నాడు నాయుడు.

## కోరిక

నవనీత భావ సంజాత
కమనీయ కవనమై
రమణీయ రాగరంజిత
మృదు మధుర నాదమై
నవవికసిత దరహాస
త్వన్నయన ద్వయగీతి–
 వినాలని ఉన్నది
 మాధవా – నా కోరిక యిది....

వెన్నెలహాయి పలుకరింతలా
పన్నీటి చిఱు చిలుకరింతలా
కమ్మని మేని పులకరింతలా
త్వత్ కరమాల నా కంఠాన్ని
 ముద్దిడాలని ఉన్నది....
 మాధవా – నా కోరిక యిది....

అనురాగమయ పూరితము
అప్యాయ వర దీపితము
ఆత్మీయ రవ శోభితము
త్వత్ హృదయ పరిష్వంగము–
 కావాలని ఉన్నది
 మాధవా – నా కోరిక యిది....

నిర్మల నీరజ సమ్మిళిత
నవ పల్లవ కోమల లలిత
విమలాయుత విద్యుల్లత
త్వత్ అధరామృత విందుల
 పొందాలని ఉన్నది
 మాధవా – నా కోరిక యిది....

మంగళ మంజీర మంజుల
నాదనినాద విలీన భరిత
మందార మకరంద సున్నిత
అరవింద పద్మదళ యుగళ
తవచరణ సన్నిధి
భవదీయురాలి పెన్నిధి
 కలగాలని ఉన్నది
 మాధవా – నా కోరిక యిది.

—ఎమ్. సీతాబాయ్

అతను తెచ్చిన రొట్టెముక్కలు, కాఫీ నలుగురూ పంచుకున్నారు. చిన్న బుడ్డి దీపం వెలిగించారు. కాని రొజ్జగాలికి ఆ దీపం అయిదు నిమిషాలు కూడా వెలగలేదు. పిల్లల్ని కొంచెం ప్రక్కకు జరిపి నాయుడికి చోటు ఇచ్చింది తవిటమ్మ. దానిని గట్టిగా గుండెలకు పొదువుకున్నాడు. నాయుడు గుండెలమీద నించి వెచ్చదనం తవిటమ్మ వీపుకు తాకి ప్రాణం సుఖంగా వుందనిపించింది. గుండెల మధ్యగా నాయుడి బలమైన చేయిని గట్టిగా అదుముకుంది. కళ్ళమీదకు హాయియైన మగతవొచ్చింది. వర్షం, ఇల్లు పిల్లలు ముసలమ్మలు బాధ్యత, చీదర అన్నీ మరచింది తవిటమ్మ. వెనకాతల భర్త అండ, గుండెల ముందర పసి పిల్లల సందడి. వెనకా ముందూ మేమున్నాము. మేమున్నాము. అంటూ భర్తా పిల్లలూ వుండగా తవిటమ్మలాంటి వాళ్ళను వానా, చీదరా ఏమి బెదరగొట్టాయి?

వెంకట్రావు, కొల్లీగ్ పురుషోత్తం సైకిల్ మీద ఇంటికి వచ్చేసరికి ఏడుగంటలయింది. జయమ్మ ఎదురొచ్చింది. అప్పటికే పిల్లలు అన్నాలు తిని మంచంమీద ఒక వారగా ఒదిగి పడుక్కుండిపోయేరు.

"ఇంతాలీసం అయ్యిందేం?'' అంది.

"సైకిల్ మీద వొచ్చేను.''

"అవ్వ! మతిగానిపోతోందా! ఈ ఈదురు గాలిలో సైకిలుమీద ఎల్లా వొచ్చేరండీ! రిక్షామీద రాకూడదూ!''

"రెండు రూపాయిలు!''

"మన్ని రక్షించుతాయి రెండు రూపాయిలూనూ. పదండి స్నానం చేయండి.'' అంది.

"స్నానమా!''

"అవును నూతిదగ్గర ఉదయం స్నానం చేసేరుగా! వేణ్ణీళ్ళు పెట్టి వుంచాను. తీరుబాటుగా సోపుతో వళ్ళు శుభ్రంగా తోముకుని స్నానం చేయండి.''

"ఆఁహా? ఏమీ నా భాగ్యం? సరే!'' వేడి వేడి నీళ్ళు పోసుకుని వచ్చేడు, పాతదయినా ఇస్త్రీ చేసిన లుంగీ కట్టుకుని పీటమీద కూర్చున్నాడు. తెల్లగా మల్లెపూవులాంటి అన్నం. వంకాయ వేపుడు, అప్పడాలు, వడియాలు, చారు ఆవకాయ.

"జయా!''

"ఏమిటండీ!''

"సర్లే. భోజనం కానియ్యి." అన్నాడు. భోజనాలు చేసి వంటిల్లు సర్ది వచ్చింది. పిల్లలు ప్రక్క వరుకున్నాడు వెంకట్రావు. అతని వెనకాతల చోటు చేసుకుంది. కిటికీలమీద తలుపుల మీద వానచప్పుడు. భర్తని గట్టిగా వాటేసుకుంది. జయ గుండెల్లోంచి వెచ్చదనం వెంకట్రావు వీపుకి గుచ్చుకుంది. జయ చేతిని తన నడుముకు చుట్టుకున్నాడు.

"జయా! అరవైఆరుకోట్ల దేశజనాభాలో ఆరుకోట్లమంది అన్నా మనపాటి తినటానికి వండుటానికి నోచుకో లేదు! ఆ విధంగా చూస్తే మనం చాలా అదృష్టవంతులం. ఈమాత్రం నిశ్చింత అయినా మనకు వుంది. ఇంత వర్షంలో చెట్లక్రిందా పాడుబడిన సత్రం అరుగుల మీదా గడవక్కర్లేకుండా ఇంత జాగా మనకుంది. ఈమాత్రం సుఖంగా మనం బ్రతకల్గుతున్నాం. కాదా?"

"అవును నిజమే" అంది జయ భర్తని ఇంకా గాఢంగా తన గుండెల్లోకి పొదువుకుంటూ.

"మనకి వూరి చివరగా వున్నామన్న భయం లేదు. ఇంటివాళ్ళు ప్రక్కనున్నారు. పనిచేయటానికి మనుషులు దొరుకుతున్నారు. ఇల్లా అద్దె చాలా చవకగా దొరికింది." అంది జయ.

"అయినా ఇల్లు మార్చేద్దాములే! వానవస్తే చాలా కష్టంగా వుంటోంది. మంచి ఇల్లుకు మారి పోదాము. మనిద్దరిలో ఎవరి ఆఫీసుకి దగ్గరగా దొరికినా ఇల్లు మారిపోదాము." అన్నాడు జయ వైపు తిరిగి ఆమె ముఖాన్ని సున్నితంగా చేతితో నిమురుతూ! జయకు హాయి అయిన మగత – శరీరం అంతా క్రమ్ముకు వచ్చింది. తనకేమిటి లోటు? తనని అమితంగా ప్రేమించే భర్త! బుద్ధిగా కుదురుగా చదువుకొనే పిల్లలు! ఈ వానా చీదర, తడవటం అన్నీ ఈ ఒక్క రోజుతో తనకు ఈ బాదరబందీ అంతా తీరిపోతుంది తెల్లవారితే ఆకాశంలో తళతళా వెండిలా మెరుస్తూ సూర్యుడుదయిస్తాడు. తమ ఆశల వాడి, వేడిలా చురకత్తుల్లా సూర్యకిరణాలు తమని తట్టి లేపుతాయి, కొత్తకొత్త ఆశలు కోరికలు తీర్చుకుంటూ జీవితం గడపవచ్చును. నేటి ఈ వానచీదర, ఈదురుగాలీ వానకు ఒరిసిపోయే పాత పెంకుటిల్లూ తననేమి చేస్తాయి?

భర్త పరిష్వంగ సుఖంలో ఉదయించిన వున్న చీకాకంతా మర్చిపోయింది జయమ్మ. □

## డాక్టర్ పుష్పమ్మ

మనదేశ వైజ్ఞానిక పురోగమనంలో వనితలు కూడా ప్రముఖ పాత్ర వహిస్తున్నారనడానికి డా॥ పుష్పమ్మను నిదర్శనంగా చెప్పవచ్చు. పోషకాహార శాస్త్రంలో ప్రఖ్యాతి వహించిన ఈమె ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన హైదరాబాదులోని హోమ్ సైన్స్ కళాశాల డీన్‌గానూ, ప్రిన్సిపాల్‌గానూ వ్యవహరిస్తున్నారు.

డా॥ పుష్పమ్మ బెనారస్ విశ్వవిద్యాలయంలో ఎం. ఎస్ సి. చేశారు. వివాహానంతరం అమెరికాకు వెళ్లి కాన్సాస్ స్టేట్ విశ్వవిద్యాలయంలో 'బయోకెమికల్ న్యూట్రిషన్'లో పరిశోధన చేసి, 1968 లో పి. హెచ్. డి. పట్టా పొందారు.

హోమ్ సైన్స్ కళాశాలలో మొదట 'ఫుడ్ అండ్ న్యూట్రిషన్' శాఖలో రీడర్‌గా చేరిన డాక్టర్ పుష్పమ్మ, క్రమంగా ప్రొఫెసరై, 1974 లో ప్రిన్సిపాల్‌గా స్థిరపడ్డారు.

"ఈ వృత్తిని ఎన్నుకోవడంలో నా ప్రధానమైన ఉద్దేశం-నిత్య జీవితంలో పోషకాహారానికున్న ప్రాధాన్యతని సగటు మనిషికి సైతం తెలియజేయాలని. పోషకాహారాన్ని గురించిన సమగ్రమైన పరిజ్ఞానాన్ని దేశం నలుమూలలకూ, అన్ని తరగతుల వారికీ అందజేయడానికి ప్రయత్నిస్తున్నాను. ఈ ప్రయత్నంలో నాకు నా విద్యార్థులు, తోటి ఉపాధ్యాయినులు ఎంతో సహకరిస్తున్నారు" అన్నారు డా॥ పుష్పమ్మ.

పోషకాహార ప్రచారంలో హోమ్ సైన్స్ కళాశాల ద్వారా జరిగే కృషి ఏయే పద్ధతుల్లో జరుగుతున్నదన్న ప్రశ్నకు డా॥ పుష్పమ్మ ఈ విధంగా చెప్పారు.

"మా కళాశాల ద్వారా ఏర్పాటు చేసే కార్యక్రమాలు-శిక్షణా కార్యక్రమాలు, సదస్సులు, వర్క్ షాపులు మొదలైన రూపాల్లో ఉంటాయి. మన దేశంలో వివిధ ప్రాంతాల్లోని స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉద్యోగినులకు మేము ఆరు వారాల పాటు శిక్షణా కార్యక్రమాల్ని నిర్వహించాం. 'అంగన్‌వాడి' సేవికులకు కూడా నాలుగు నెలల పాటు శిక్షణనిచ్చాం.

"మా కార్యక్రమాలు ఎక్కువగా - భర్తతో పాటు పొలంలో పనిచేసి, ఇంటి భారాన్ని కూడా నిర్వహించవలసిన గ్రామీణ స్త్రీలకు ఉపకరించేవిగా ఉంటాయి.



తక్కువ ఖర్చుతో, తక్కువ శ్రమతో, తక్కువ సమయంలో, ఎక్కువ లాభాన్ని కలిగించే విధానాలను వాళ్లకు నేర్పించడం మా ప్రధానమైన బాధ్యత. పోషకాహార విషయంలో గానీ, వ్యవసాయపు పనులలోగానీ, ఆరోగ్య విషయంలోగానీ - వారు వహించవలసిన జాగ్రత్తలను తెలపడానికి మేమెన్నో కార్యక్రమాలు చేపట్టాము.

"ముందుగా వ్యవసాయ పథకాల గురించి, గ్రామీణ ప్రజల ఇక్కట్లను గురించి సదవగాహన కలిగితే కానీ, వాళ్ళకు మనం ఏ రూపంలో తోడ్పడగలమో తెలీదు కాబట్టి, ఈ అంశాలపై మా కళాశాలలో సదస్సులు నిర్వహించాం.

"ఈ సదస్సులు, వర్క్ షాపులు మొదలైన వాటి నిర్వహణలో మా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ వ్యవసాయ శాఖ, జాతీయ పోషకాహార సంస్థ (N I N) మాత్రమే గాక, యూనిసెఫ్ వంటి విదేశీయ సంస్థలు కూడ, మాకు ఆర్థికంగాను, ఇతరత్రానూ తోడ్పడి, ఎంతో ప్రోత్సహించాయి."

1978 జూలైలో నైరోబి (కెన్యా)లో ఏర్పాటు చేసిన పోషకాహారానికి సంబంధించిన వర్క్ షాప్‌లోను, 1978 డిసెంబరులో 'అంతర్జాతీయ అభివృద్ధి పరిశోధక కేంద్రం' సింగపూరులో ఏర్పాటు చేసిన వర్క్ షాప్‌లో కూడా పాల్గొన్నారు.

పోషకాహారానికి సంబంధించిన పరిజ్ఞానం సాధ్యమైనంత మంది జనులకు అందుబాటులోకి తీసుకు రావాలనే ఉద్దేశ్యంతో స్థానిక పత్రికలైన 'రైతు లోకం' 'అన్నదాత'లలో తమ వ్యాసాలు కూడా వ్రాశానని ఆమె చెప్పారు.

—హైదరాబాదు విలేకరి